

సోమశిలలో 73.08 టీఎంసీల నిల్వ

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 73.08 టీఎంసీలు ఉంది. ఎగువ నుంచి 11,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తర కాలువకు 500, కండలేరుకు 2 వేలు, దక్షిణకాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.7,118
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,332
నవర (8 గ్రాములు)	రూ.58,656

గరిష్టం/కనిష్టం
32.1 /26.1

వాతావరణం

జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా ఉంటుంది. అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది. శుక్రవారం గాలిలో తేమ 84 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఎవరికీ డబ్బులు చెల్లించడం లేదు

నెల్లూరు (టౌన్): నెల్లూరు రవాణాశాఖలో ఎంవీఐగా పనిచేస్తున్న బాలమురళీకి గానీ, ఏ ఇతర రవాణా శాఖాధికారులకు తాము ఎలాంటి డబ్బులు చెల్లించడం లేదని చీమకుర్తి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రానైట్ లారీల తరఫున రవాణా అధికారులకు డబ్బులిస్తున్నామన్న ప్రచారం అవాస్తవమన్నారు.

సాయుధ దళాల నిధికి విరాళాలివ్వండి

నెల్లూరు (అర్బన్): దేశ రక్షణ కోసం కుటుంబాలకు, బంధాలకు దూరంగా ఉంటూ రేయింబవళ్లు సరిహద్దులో కష్టపడుతూ ఎంతో మంది సైనికులు ప్రాణత్యాగం చేస్తున్నారని, ఆ సాహసోపేత అమర జవానులకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికుల కుటుంబాలకు పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత సైనిక దళాలు మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తుందన్నారు. కార్గిల్ పోరాట సమయంలో, జమ్మూ–కశ్మీర్ పరోక్ష యుద్ధంలో, ప్రకృతి వైపరీత్యాల్లో సరిహద్దు లోపల, వెలుపల సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఎన్‌సీసీ విద్యార్థులు పతాక నిధికి విరాళాలు సేకరించేందుకు వస్తారని కలెక్టర్ తెలిపారు. పౌరులు, వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, పారిశ్రామిక వేత్తలు ఉదారంగా విరాళాలివ్వాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారికి ఈసీఎస్ ద్వారా, క్యూఆర్ కోడ్ ద్వారా లేదా అకౌంట్ నంబర్ 52078996140 అనే బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020897, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, దర్గామిట్ట, నెల్లూరు బ్రాంచ్‌కు విరాళాలు పంపవచ్చన్నారు. విరాళాలకు సెక్షన్ 80(జి)(5)(వి1), ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఉందని వివరించారు.

మరో 110 మంది హెల్త్ అసిస్టెంట్లపై వేటు

- 22 ఏళ్లు కష్టపడితే ఇప్పుడు రోడ్డున పడేస్తారా అంటూ ఆక్రోశం

నెల్లూరు(అర్బన్): కోర్టు తీర్పు పేరుతో ఇప్పటికే జిల్లాలో 54 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగించిన వైద్యశాఖాధికారులు, తాజాగా మరో 110 మందిపై వేటు వేసే అవకాశం కన్పిస్తోంది. దాదాపు 22, 20, 15 ఏళ్లుగా ఇలా వైద్యశాఖలో విధులు నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో కష్టపడితే వయో పరిమితి దాటాక ఆ పోస్టుల నుంచి ఇప్పుడు తొలగించడం అన్యాయమని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. 2002, 2003, 2007 ఇలా పలు దఫాలుగా రిక్రూట్‌మెంట్‌లో డీఎస్సీ సెలక్షన్ కమిటీ ద్వారా హెల్త్ అసిస్టెంట్లుగా ఎంపికై ఉద్యోగాలు చేస్తున్నారు. అప్పట్లో వీరి విద్యార్హతలు, సర్టిఫికెట్లు సరైనవా? కాదా? సమర్పించిన సర్టిఫికెట్లు మంజూరు చేసిన విద్యా సంస్థలకు గుర్తింపు ఉందా అని పరిశీలించుకోవాలి. మెరిట్ లిస్టు వేసి ఇంటర్వ్యూ చేసిన సమయంలోనూ, ఉద్యోగానికి ఆర్డర్ వేసే సమయంలోనూ సర్టిఫికెట్లు సరైనవా? కాదా పరిశీలించాలి. అలా జరగకపోవడంతో కోర్టు చిక్కులు వచ్చాయి. ఈ నేపథ్యంలో అప్పట్లోనే ఉద్యోగాల నుంచి తొలగించాల్సి వచ్చింది. అయితే ఇంత మందిని ఎలా తొలగిస్తారని కోర్టు ప్రశ్నించే సరికి ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రంలో 2013లో జీఓ నంబర్ 1,207 ద్వారా వీరికి ఉద్యోగాలు ఉండేలా అవకాశం కల్పించారు. దీనిపై కూడా కొంత మంది కోర్టు కెక్కారు. విచారించిన కోర్టు సుదీర్ఘకాలం తర్వాత 273 జీఓ ప్రకారం 54 మందిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు ఆ ప్రభావం కొత్త వారిపై కూడా పడింది. మరో 110 మంది ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని రోదిస్తున్నారు. 2 నెలల ముందు నోటీసులు ఇచ్చి తర్వాత తొలగించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ అత్యుత్సాహంతో నేరుగా రాత్రికి రాత్రే రోడ్డున పడేస్తోంది.

ఇది అన్యాయం



ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం డీఎస్సీ కమిటీ ద్వారా సెలక్ట్ అయి ఉద్యోగాలు పొందాం. ప్రభుత్వం చేసిన పొరపాట్లకు 22 ఏళ్ల తర్వాత ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయం. వేరేపని చేద్దామనుకున్నా వయస్సు పైబడింది. ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

– వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్, నెల్లూరు

రేషన్ దందా.. తగ్గేదేలే

రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా పుష్ప రేంజ్‌లో జరుగుతోంది. బియ్యం తరలించే వాహనానికి ముందు పోలీస్ స్టిక్కర్‌తో ఉన్న కారు ఎస్కార్ట్‌గా వెళ్తోందంటే మాఫియా ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోంది. కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం బయట పడడంతో తాజాగా అన్ని ప్రాంతాల నుంచి కూడా కోల్‌కత్తా–చెన్నై వైపు మళ్లినట్లు సమాచారం. జిల్లాలోని కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు చేరుతున్నట్లు తెలుస్తోంది. ఈ పోర్టులపై పెద్దగా ఎవరి దృష్టి లేకపోవడం, ప్రధానంగా ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల్లో తనిఖీలు కూడా లేకపోవడంతో రేషన్ మాఫియాకు వరంగా మారింది.

అక్రమ రవాణాకు డెన్‌లుగా రైస్‌మిల్లులు

- నెల్లూరు కేంద్రంగా నాలుగు జిల్లాల నుంచి బియ్యం సేకరణ
- చెక్‌పోస్టుల్లో తనిఖీలు కూడా లేకపోవడం అనుకూలం
- కృష్ణపట్నం, చెన్నై పోర్టుల ద్వారా ఇతర దేశాలకు తరలింపు
- ప్రతి నెలా రూ.కోట్లలో ఆర్జిస్తున్న కూటమి నేతలు



కావలిలో శుక్రవారం పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం లారీలు



కావలి/నెల్లూరు (పొగతోట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు దక్షిణ కోస్తా జిల్లాల నుంచి రేషన్ బియ్యం సముద్ర మార్గాల ద్వారా ఆఫ్రికా దేశాలకు తరలిపోతోంది. కొద్ది నెలలుగా ఉమ్మడి వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భారీ స్థాయిలో రేషన్ బియ్యం సేకరించి, స్థానికంగా ఉండే రైస్‌మిల్లుల్లో పాలిష్ పట్టించి జిల్లాలో మీదుగా కృష్ణపట్నంతోపాటు చెన్నై పోర్టుల ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. నెల్లూరుకు సమీపంలోని సౌత్‌రాజుపాళెం, గుడిపల్లిపాడు రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేస్తుంటే.. కావలి పట్టణంలోని రైస్‌మిల్లుల కేంద్రంగా, కావలి రూరల్, జలదంకి, కలిగిరి, కొండాపురం, బోగోలు, గుడ్లూరు, కందుకూరు, లింగసముద్రం, ఉలవపాడు, సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో రేషన్‌కార్డుల దారుల నుంచి నేరుగా బియ్యం సేకరించి పాలిష్ పట్టించి బ్రాండెడ్ సంచుల్లో ప్యాకింగ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతాలతో పాటు తీర ప్రాంతాల నుంచి సేకరించిన బియ్యాన్ని అక్కడే పాలిష్ పట్టించి నేరుగా పోర్టులకు రవాణా చేస్తున్నారని స్పష్టమవుతోంది.

అడపాదడపా పట్టుబడిన రేషన్ బియ్యం

- గత నవంబర్ 6వ తేదీ రాత్రి కావలి సమీపంలోని ముసునూరు టోల్ ప్లాజా చెక్‌పోస్ట్‌లో రెండు లారీల్లో రవాణా అవుతున్న 55 టన్నుల రేషన్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 4వ తేదీ కావలి పట్టణంలోని ఒక రైస్ మిల్లు నుంచి బహిరంగ మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న లారీలో లోడ్ చేసిన 6.6 టన్నుల రేషన్ బియ్యంను స్థానిక తహసీల్దార్ రహస్య సమాచారంతో అక్కడకు చేరుకుని స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 4వ తేదీన వైఎస్సార్ జిల్లా బద్వేలులో బియ్యం లారీని అధికారులు పట్టుకున్నారు. లారీ డ్రైవర్ కొంతకాలంగా వైఎస్సార్ జిల్లాలో సేకరించిన బియ్యాన్ని నెల్లూరుకు అక్రమ మార్గంలో తరలిస్తున్నానంటూ ఒప్పుకున్నాడు.

స్మగ్లింగ్ డెన్లుగా కొన్ని రైస్ మిల్లులు

కావలిలోని కొన్ని రైస్‌మిల్లులు రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే డెన్‌లుగా విరాజిల్లుతున్నాయి. కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారి మీదుగా ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల నుంచి నేరుగా చెన్నై సీ పోర్టుకు బియ్యం యథేచ్ఛగా తరలిపోతున్నాయి. ప్రధానంగా ఆంధ్రా, తమిళనాడు సరిహద్దులో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులో తనిఖీలు కూడా లేవు. దీంతో ఎక్కడా తనిఖీలు జరగడం లేదు. రేషన్ బియ్యం మాఫియాలోని వ్యాపారస్తుల నడమ విభేదాలు వచ్చిన సందర్భంలో మాత్రమే చెన్నై సీ పోర్టుకు తరలిపోతున్న రేషన్ బియ్యం లారీల జాడ గురించి పోలీసులకు రహస్యంగా సమాచా రం అందుతోంది. ఫిర్యాదులు, రహస్య సమాచారం వస్తే తప్ప అధికారులు స్పందించడం లేదు. సగటున ప్రతి నెలా రూ.10 కోట్లు రేషన్ బియ్యం అక్రమ వ్యాపా రం జరుగుతుందని అంచనా. కిలో రూ.10 నుంచి రూ.15 మేర కొనుగోలు చేసి, రూ.20 నుంచి రూ.25 వరకు హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. రేషన్ బియ్యం బహిరంగంగానే ఆటోలు, జీపుల్లో తరలిస్తున్నారు.

నెల్లూరు టు.. కృష్ణపట్నం, చెన్నైపోర్టు టు ఆఫ్రికా దేశాలకు..

కృష్ణపట్నం, చెన్నై పోర్టుల నుంచి ఇతర దేశాలకు, నెల్లూరు నుంచి చెన్నై పేదల బియ్యం అక్రమ రవాణా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,860కి పైగా రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతి నెలా 26 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం కార్డుదారులు మినహా మిగిలిన వారు నాణ్యమైన బియ్యాన్ని వినియోగిస్తున్నారు. చౌకదుకాణాల ద్వారా వచ్చిన బియ్యాన్ని కార్డుదారులు కేజీ రూ.10 వంతున ఎండీయూ ఆపరేటర్లకు విక్రయిస్తున్నారు. ఎండీయూ ఆపరేటర్లు నెల్లూరు నగరంలోని అక్రమ రవాణాలో కీలకంగా వ్యవహరించే వ్యక్తికి బియ్యం కేజీ రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. ఆ విధంగా సేకరించిన బియ్యాన్ని రైస్ మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి ఇతర దేశాలకు తరలిస్తున్నారు. దీనికి సంబంధించి కీలకంగా వ్యవహరిస్తున్న వ్యాపారికి కేజీకి రూ.25పైగా ఆదాయం వస్తుంది. ఈ విధంగా వచ్చిన ఆదాయాన్ని ఆయా నియోజకవర్గాల శాసన సభ్యులు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, విజిలెన్స్ అధికారులకు ముడుపులు ఇస్తున్నట్లు సమాచారం.

300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీ



పోలీసు స్టిక్కర్‌తో బియ్యం తరలిస్తున్న కారు

- పోలీస్ స్టిక్కర్ కారుతో ఎస్కార్ట్

ఉలవపాడు: అక్రమంగా తరలిస్తున్న 300 బస్తాల రేషన్ బియ్యాన్ని ఉలవపాడు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. కావలి నుంచి ఒంగోలు వైపు రేషన్ బియ్యం లారీ వెళ్తుందని వచ్చిన సమాచారం మేరకు.. ఉలవపాడు పోలీసులు వీఆర్‌ఓతో కలిసి ఉత్తరబైపాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. ముందు పోలీస్ స్టిక్కర్‌తో కారు వెళ్తుంటే.. వెనుక లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారు. ముందుగా కారును ఆపి విచారించగా కావలిలోని రైస్‌మిల్లు నుంచి 300 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నామని చెప్పడంతో కారును స్వాధీనం చేసుకుని, అందులోని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వెనుకనే ఉన్న 300 బస్తాల లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

995 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- మూడు లారీలను సీజ్ చేసిన పోలీసులు
- కావలిలోని రైస్‌మిల్లు నుంచి తరలిస్తున్నట్లు గుర్తింపు
- తెల్లారిపోవడంతో లారీల పార్కింగ్ స్థలంలో ఉంచిన రేషన్ బియ్యం

కావలి: పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో పాలిష్ పట్టించి అక్కడి నుంచి తరలించేందుకు సిద్ధమై, ఎవరికి అనుమానం రాకుండా లారీల పార్కింగ్ స్థలంలో ఉంచిన మూడు లారీల్లోని 995 బస్తాల రేషన్ బియ్యాన్ని కావలి వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ రైస్‌మిల్లులో నిల్వ చేసిన రేషన్ బియ్యంను మార్కెట్‌కు తరలించడానికి మూడు లారీల్లో 995 బస్తాలు రాత్రి వేళల్లో లోడ్ చేశారు. అయితే సరికి తెల్లారిపోవడంతో, పగటిపూట రవాణాతో తనిఖీలు, ఇతరత్రా సమస్యలు వస్తాయని రేషన్ బియ్యం మాఫియా భావించింది. లోడ్ చేసిన లారీలను రైస్‌మిల్లు ప్రాంతం, పరిసరాల్లో లారీలను పార్కింగ్ చేస్తే స్థానికులకు అనుమానం వచ్చి అధికారులకు సమాచారం ఇస్తారని, ఎవరికి అనుమానం రాకుండా పట్టణ పొలిమేరల్లో లారీలు పార్కింగ్ చేసే ప్రాంతంలో వాటి మధ్యలో రేషన్ బియ్యం లోడుతో ఉన్న మూడు లారీలను తీసుకెళ్లి పార్కింగ్ చేశారు. అయితే రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న లారీలు పార్కింగ్ చేసిన విషయం కావలి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందడంతో హుటాహుటిన వెళ్లి తనిఖీలు చేశారు. దీంతో మూడు లారీల్లో రేషన్ బియ్యం ఉండడంతో లారీలను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రేషన్ బియ్యంను పౌరసరఫరాలశాఖకు అప్పగించారు.

ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం

పేదల బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులందితే చర్యలు తీసుకుంటాం. రైస్‌మిల్లుల్లో నిల్వలు ఉన్నాయనే సమాచారమిస్తే దాడులు నిర్వహించి బియ్యం నిల్వలు స్వాధీనం చేసుకుని రైస్‌మిల్లులు సీజ్ చేస్తాం. అక్రమ రవాణాకు సంబంధించి విజిలెన్స్, పోలీసు అధికారులతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం.

– వెంకటరమణ, డీఎస్‌ఓ, నెల్లూరు

స్ఫూర్తిదాత అంబేడ్కర్

- మాజీ మంత్రి కాకాణి

నెల్లూరు (బారకాసు): రాజ్యాంగకర్తగా, దేశ భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కాకాణి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. కాకాణి మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితోనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. సృష్టిలో సూర్య, చంద్రులు ఉన్నన్నాళ్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా చిరస్థాయిగా ఉండిపోతారన్నారు. అంబేడ్కర్ తన చిన్నతనం నుంచి కుల వివక్ష, అంటరానితనం వంటి ఎన్నో దురాగతాలను భరించి దేశంలోనే అత్యంత ఉన్నత స్థాయికి ఎదిగిన మహనీయుడని అన్నారు. చంద్రబాబు అంబేడ్కర్ 125వ జయంతిని పురస్కరించుకుని 125 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి ఆ తర్వాత పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో ఆంధ్రులు అందరూ గర్వించే విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. అయితే తిరిగి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించే రీతిలో వ్యవహరించారన్నారు. తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ ఆశయ సాధన కోసం జిల్లాలో తమ పార్టీ శ్రేణులందరం కలిసికట్టుగా కృషి చేస్తామని చెప్పారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించిన కాకాణి

టీడీపీ నేత దాష్టీకం

- వరుసకు సోదరి ఇంటిని ధ్వంసం చేసిన వైనం
- ఇప్పటికే పొలం ఆక్రమించి రిజిస్ట్రేషన్

అనుమసముద్రంపేట: టీడీపీ నేతలు దౌర్జన్యాలకు, దాష్టీకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఆఖరికి బంధుత్వాలను కూడా పట్టించుకోలేదు. మండలంలోని హసనాపురంలో టీడీపీ కన్వీనర్ తనకు సోదరి వరుస అయ్యే మహిళ ఇంటిని జేసీబీతో ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. బాధిత మహిళ కామినేని పద్మ వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కావడంతో ఆమె తండ్రి వారసత్వ ఆస్తులను కాజేసేందుకు కొద్ది రోజులుగా దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. ఆమె కథనం మేరకు.. గ్రామంలో తన తండ్రి అబ్బూరు చిన వెంకటసుబ్బయ్య ఇల్లు ఉంది. ఆ ఇంటి పక్కనే అన్న వరసయ్యే టీడీపీ నేత అబ్బూరి రమేష్‌నాయుడు ఇల్లు ఉంది. కామినేని పద్మ తండ్రి చిన వెంకటసుబ్బయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయనకు సంబంధించి మెట్ట పొలం, సొంత ఇల్లు ఉండేవి. ఈ రెండింటిని అబ్బూరి రమేష్ నాయుడు ఆక్రమించుకున్నాడు. పొలాన్ని రమేష్‌నాయుడు తన పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోగా గురువారం రాత్రి ఏకంగా ఆ ఇంటిని ధ్వంసం చేసి, తనకు ఆధారం లేకుండా చేశారడని వాపోయింది. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా.. స్వీకరించకపోవడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లి పట్టుబట్టారు. రెవెన్యూ అధికారులు నా తండ్రి ఆస్తి నాకు ఇప్పించాలని, లేని పక్షంలో కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఎట్టకేలకు ఇంటి ధ్వంసమై గురువారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు.



ఇంటిని ధ్వంసం చేసి, బయటపడేసిన సామగ్రి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న పద్మ

భవన నిర్మాణాలకు 24 గంటల్లోనే అనుమతులు



- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు (బారకాసు): భవన నిర్మాణాలకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లోనే అనుమతులు ఇచ్చే నూతన విధానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం నెల్లూరు కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగ సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ వివి ద లేఅవుట్లో పార్కుల కోసం కేటాయించిన భూమిని కచ్చితంగా పార్కుల కోసమే వినియోగించాలన్నారు. నగర పాలక సంస్థను ప్రతి వారం సమీక్షిస్తున్నామని, నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నగరంలోని పార్కులను సెంట్రల్ లైటింగ్ సిస్టంను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు కూడా వివిధ రకాల రెవెన్యూ బకాయిలను చెల్లించాలన్నారు. నాలుగు నెలల్లో రూ.6.5 కోట్ల రెవెన్యూ బకాయిలు ప్రజలు చెల్లించారని, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా వారు కూడా పెండింగ్‌లో ఉన్న రూ.120 కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు. నగరంలోని పశువుల సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక వాహనం కేటాయిస్తున్నామన్నారు. వీధి కుక్కల పునరుత్పత్తికి అవకాశం లేకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నారుమళ్ల నష్టంపై అంచనా

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి



కొడవలూరు: ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిన్న నారుమళ్ల నష్టాన్ని అంచనా వేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి తెలిపారు. మండలంలోని నాయుడుపాళెంలో రెవెన్యూ సదస్సుకు శుక్రవారం హాజరైన ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీతో విత్తనాలు అందజేస్తామన్నారు. తహసీల్దార్ కె.స్ఫూర్తి మాట్లా డుతూ రెవెన్యూ సదస్సుల్లో అన్నీ ప్రభుత్వ శాఖలకు చెందిన వినతులు స్వీకరించి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, ఆర్‌ఐ సునీల్‌రెడ్డి, వీఆర్వో సురేష్, గ్రామ సర్వేయర్ అద్భుతరాణి, స్థానిక నాయకుడు మాగుంట సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

నెల్లూరురూరల్: జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక, దేవదాయ, అటవీశాఖ పరిధిలో దర్శనీయ ప్రదేశాల పూర్తి సమాచారాన్ని వికిపీడియాలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో టూరిజం అడ్వెంచర్ స్పోర్ట్స్ రోప్‌వే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రదేశాల్లో ఏమైనా పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు పర్యాటక రంగం గొప్పతనం తెలిసేలా జిల్లాలోని చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యత తెలిసేలా డాక్యుమెంట్లను తయారు చేసి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెప్పారు. సోమశిల ఫారెస్ట్ భూములను టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం తయారు చేయాలన్నారు. ఉదయగిరి దుర్గం వద్ద రోడ్ల అభివృద్ధికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఆర్కియాలజీ శాఖ పరిధిలో జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. పెంచలకోన, బారాషహీద్ దర్గా, పల్లిపాడు ప్రాంతాల అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలన్నారు. నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు నరసింహకొండ, జొన్నవాడ రోప్‌వేలకు భూములను గుర్తించాలని చెప్పారు. టూరిజం, ఎండోమెంట్, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో పని చేసి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీఎం శ్రీనివాస్, జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈఓ బాలాజీరావు, సోమశిల ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ఆయా శాఖల ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

క్లుప్తంగా

నేడు తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు

• కలెక్టర్ ఆనంద్



నెల్లూరు రూరల్: జిల్లాలోని 2,604 పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామన్నారు. సమావేశాలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసేలా కంట్రోల్‌రూమ్‌ను (0861 – 2331261) ఏర్పాటు చేశామన్నారు. సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే సంప్రదించాలని కోరారు. ఆత్మకూరులో మంత్రి రామనారాయణరెడ్డి, నెల్లూరులో మంత్రి నారాయణ సమావేశాల్లో పాల్గొంటారని తెలియజేశారు.

తల్లి చెంతకు బాలుడు



బాలుడిని తల్లికి అప్పగించిన ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): స్కూల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తప్పించుకొచ్చిన బాలుడిని నెల్లూరు సంతపేట పోలీసులు సంరక్షించి తల్లి చెంతకు చేర్చారు. వారి కథనం మేరకు.. జనార్దనరెడ్డి కాలనీ టిడ్కో ఇళ్లలో కరిమున్నీసా కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు స్థానికంగా ఉన్న పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. బాలుడు శుక్రవారం స్కూల్‌కు వెళ్తున్నానని బయటికొచ్చి నడుచుకుంటూ కపాడిపాళెం చేరుకున్నాడు. స్థానికులు గమనించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. వారు సంరక్షించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు బాలుడిని తల్లికి అప్పగించారు.

వన్యప్రాణులను వేటాడితే కేసులు

• మార్చి నాటికి నగర వనం పనులు పూర్తి
• డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా



నెల్లూరు(అర్బన్): చట్టాన్ని అతిక్రమించి వన్యప్రాణులను వేటాడితే కఠినమైన కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని డీఎఫ్‌ఓ మహబూబ్‌బాషా తెలిపారు. ఇటీవల డీఎఫ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న అటవీ శాఖ కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలన్నారు. జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటే కార్యక్రమంలో అటవీ శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ఇప్పటికే 412 హెక్టార్లలో ఎర్రచందనం, వేప, మద్ది, రావి, జువ్వి, నేరేడు, కానుగ మొక్కలను నాటామన్నారు. ఆత్మకూరు రేంజ్ పరిధిలో మరో పది హెక్టార్లలో మొక్కలు నాటుతున్నామన్నారు. జిల్లాలో 2,29,000 హెక్టార్లలో ఉన్న అటవీ ప్రాంతంలో స్మగ్లింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. అలాగే అటవీ భూముల్లో మైనింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కొత్తూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో నగర వనం ఏర్పాటు చేశామన్నారు. అందులో రూ.1.60 కోట్లతో ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. మరో రూ.60 లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో వచ్చే మార్చినెల నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు.

భూ సమస్యపై విచారణ

నెల్లూరు రూరల్: మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన తుమ్మల హైమావతమ్మ తన పొలాన్ని ఆక్రమించారని ఈనెల 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ ఆనంద్ విచారణ చేయాలని నెల్లూరు ఆర్డీఓ అనూషను ఆదేశించారు. ఈ క్రమంలో ఆమె తహసీల్దార్, సర్వేయర్, సబ్ ఇన్‌స్పెక్టర్లను ఆ గ్రామానికి పంపి విచారణ చేయించారు. ఇరువర్గాలకు నచ్చజెప్పారు. వర్షపునీరు తగ్గిన వెంటనే సర్వే చేసి సరిహద్దులు చూపించి భూమిని ఫిర్యాదుదారుకు అప్పగిస్తామని ఆర్డీఓ శుక్రవారం తెలిపారు. 50 సెంట్ల భూమిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఆ గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల్లేవని తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.30
సన్నవి :	రూ.20
పండ్లు :	రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) :	96
లేయర్ (లైవ్) :	110
బ్రాయిలర్ చికెన్ :	180
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	200
లేయర్ చికెన్ :	187

అనుమతి మేరకే సాగు

• స్థానిక పొగాకు రైతులకు సూచిస్తున్న బోర్డు
• అధికంగా వద్దంటున్న అధికారులు
• అంతర్జాతీయంగా పరిస్థితులే కారణం
• సమన్వయం పాటిస్తేనే మేలు

మర్రిపాడు: సాధారణంగా పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి. విదేశాల్లో పంట విస్తీర్ణం పెరిగితే దాని ప్రభావం ఇక్కడి పొగాకు ధరలపై పడుతుంది. ఇక్కడ వర్జీనియా రకం 65 శాతం మేర విదేశాలకు ఎగుమతి అవుతుంది. ఈ పంట ఎక్కువగా పండించే బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా తదితర దేశాల్లో గత మూడేళ్లుగా ఉత్పత్తి తగ్గింది. దీంతో కంపెనీలు మన వద్దనున్న ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపాయి. ప్రస్తుతం ఆయా దేశాల్లో ఉత్పత్తి పెరగడంతో ఈ ఏడాది ఇక్కడి నుంచి ఆశించిన స్థాయిలో ఎగుమతులకు ఆస్కారం ఉండకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అనుమతించిన మేరకే సాగు చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఇక్కడి రైతులపై ప్రభావం

కర్ణాటకలో మూడు, నాలుగేళ్లుగా వంద మిలియన్ కిలోల పొగాకు పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతినిస్తుండగా ఎంతో కొంత తక్కువగానే పండుతోంది. అందులో 2022 – 23లో అయితే గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది కేవలం 60 మిలియన్ కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. 2023 – 24లో కూడా 100 మిలియన్లకు అనుమతించగా కేవలం 83 మిలియన్ కిలోలను పండించారు. గరిష్ఠంగా ధర రూ.289 పలికింది. చివరకు సగటు ధర రూ.254 వద్ద నిలిచింది. అక్కడ పంట ఉత్పత్తి తగ్గడం మన రాష్ట్రంలోని రైతులకు లాభించింది. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో కర్ణాటకలో 100 మిలియన్ కిలోల పంటకు బోర్డు అనుమతించింది. అయితే వాతావరణం అనుకూలించడం, తోటలు ఏపుగా పెరుగుతుండడంతో 110 మిలియన్ కిలోల ఉత్పత్తి రావొచ్చని అధికారులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. అంటే 2023 – 24 కంటే దాదాపు 30 మిలియన్ కిలోలు అధికంగా రావొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం మన రాష్ట్రంలోని రైతులపై పడే అవకాశం అధికంగా ఉంది.



డీసీపల్లిలో సాగు చేసిన పొగాకు పంట

మూడు సంవత్సరాలుగా పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు గతం కంటే అధికంగా సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే నాటి ధరలు కొనసాగుతాయని భావిస్తే పొరపాటేనని బోర్డు అధికారులు ముందస్తుగానే హెచ్చరిస్తున్నారు. చాలాచోట్ల సాగు పెరిగింది. దీంతో సమన్వయం పాటిస్తేనే ఎక్కువగా నష్టపోకుండా ఉంటారని చెబుతున్నారు.

డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలో..

పొగాకు సాగు చేసే మండలాలు :	ఇప్పటి వరకు నమోదైన రైతుల సంఖ్య :
11	1,700 కు పైగా..

3,300 హెక్టార్లలో..

ప్రస్తుతం మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో రైతులు 3,300 హెక్టార్లలో నాట్లు పూర్తి చేశారు. గత సంవత్సరం 6,600 హెక్టార్లలో 98 లక్షల కిలోలను పండించారు. గరిష్ఠ ధర రూ.362, కనిష్ఠ ధర రూ.140గా నమోదైంది. గతేడాది బోర్డు పరిధిలో 6.3 మిలియన్ కిలోలకు అనుమతివ్వగా సుమారు 10 మిలియన్ కిలోలను పండించారు. 2024 – 25 పంట కాలంలో ఒక బ్యారెన్‌కు 3.37 హెక్టార్లలో అంటే 4,275 కిలోలు మాత్రమే పండించాలని అధికారులు తెలిపారు. ఇది గత పంట కాలం కంటే 625 కిలోలు అధికం. సమీప రాష్ట్రాల్లో, విదేశాల్లో మూడు సంవత్సరాలుగా పంట తగ్గుముఖం పట్టడంతో స్థానిక వేలం కేంద్రం పరిధిలోని రైతులు అదనపు ఆదాయాన్ని పొందారు. అయితే ప్రస్తుతం కర్ణాటకతోపాటు విదేశాల్లోనూ పంట సాగు పెరిగిన నేపథ్యంలో రైతులు బోర్డు అనుమతించిన మేరకే నాణ్యమైన పొగాకును పండించాలని అప్పుడే నష్టాల నుంచి బయట పడొచ్చని అధికారులు సూచిస్తున్నారు.



వెన్నవాడలో పొగాకు సాగు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి



డీసీపల్లి వేలం కేంద్రం పరిధిలో రైతులు అనుమతించిన మేరకే పొగాకు పండించాలి. అధికంగా సాగు చేస్తే డిమాండ్ తగ్గిపోయి గిట్టుబాటు ధరలు వచ్చే అవకాశం ఉండదు. మూడేళ్లుగా కొన్ని దేశాల్లో సాగు తగ్గడంతో ఇక్కడి పంటకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం అన్ని దేశాల్లో పెరిగే అవకాశం ఉంది. అందువల్ల బ్యారెన్లు, పొలాలు అధిక ధరలకు కౌలుకు తీసుకుంటే నష్టపోయే అవకాశముంది. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి. నాణ్యమైన పొగాకు పండించేందుకు పొటాష్ ఎరువులు వాడాలి. లోగ్రేడ్ పొగాకుతో నష్టపోయే అవకాశం ఉంది. వర్షాలు కురిసినప్పుడు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

– జి.రాజశేఖర్, డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు

• ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయం. వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం నిర్వహించారు. దీనికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్, ఐటీ కోర్, మోటార్ ట్రాన్స్‌పోర్టు, ఫైర్ తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు హాస్పిటల్లో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. శాఖాపరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన వారు ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు అవకాశం కల్పిస్తామన్నారు. విధి నిర్వహణతోపాటు కుటుంబంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న పోలీసు గ్రీవెన్స్‌ను వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ ఏడాది విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన 29 మంది హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, మునిరాజు, ఎస్బీ, నెల్లూరు నగర, రూరల్, డీటీసీ, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్ రావు, చంద్రమోహన్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఆర్ఐలు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్, పోలీసు అధికారులు

కావలిలో క్రీడా పోటీలు ప్రారంభం

కావలి: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ స్థాయి అంతర్ కళాశాలల 2024 – 25 క్రీడా పోటీలు శుక్రవారం పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా మైదానంలో ప్రారంభమయ్యాయి. కావలి ఆర్డీఓ ఎం.వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. విశ్వోదయ రెక్టార్ డి.వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీల్లో పాల్గొంటే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవరుతాయని తెలియజేశారు. ఇంకా కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.పి.సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడారు. ఫిజికల్ డైరెక్టర్, పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.పి.ప్రసాద్‌రెడ్డి వార్షిక నివేదికను సమర్పించారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డా.సీహెచ్ వెంకట్రాయలు, యూనివర్సిటీ అథ్లెటిక్ మీట్ పరిశీలకులు డా.ఎ.ప్రవీణ్ కుమార్, విశ్వ విద్యాలయ పరిధిలోని 15 కళాశాలల క్రీడాకారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీఓ వంశీకృష్ణ



లాంగ్ జంప్ పోటీలు

సదస్సులకు స్పందన నామమాత్రం



మనుబోలులో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు

• తొలిరోజు 435 అర్జీల అందజేత

నెల్లూరు(అర్బన్): మీ భూమి – మీ హక్కు పేరుతో శుక్రవారం రెవెన్యూ సదస్సులు మొదలయ్యాయి. తొలిరోజు 45 గ్రామాల్లో జరగ్గా అధికారుల హడావుడి తప్పితే ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. వీఆర్వోలు, వీఆర్ఏలు, తహసీల్దార్లు, మండల, గ్రామ సర్వేయర్లు, స్పెషలాఫీసర్లు ఉండి కూడా లాభం లేకుండా పోయింది. అనేక సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌లు తెలిపారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద అర్జీలు స్వీకరించినట్టే ఇక్కడ మమ అనిపించారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకం లేక జిల్లా వ్యాప్తంగా కేవలం 435 మంది మాత్రమే తమ సమస్యలపై అర్జీలిచ్చారు. నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. అనేకచోట్ల రెవెన్యూ యంత్రాంగం వస్తున్న విషయం ప్రజలకు తెలియలేదు. వచ్చే నెల 8వ తేదీ వరకు 747 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరగాల్సి ఉంది. అడంగళ్ వన్‌బీ, రిజిస్టర్ 22 (ఏ), భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వ పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, అసైన్డ్, చుక్కల భూముల పరాధీనం, కబ్జాలు తదితర సమస్యలు పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. వీటిని జిల్లా యంత్రాంగం ఏ మేరకు పరిష్కరిస్తుందో తెలియాలి.



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ఎన్నిసార్లు అర్జీలివ్వాలి?

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. అధికారులు మారినప్పుడల్లా భూ సమస్యల కోసం అర్జీలిస్తున్నామని, అవి బుట్టదాఖలవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదని తహసీల్దార్ సుభద్రను పలువురు గ్రామస్తులు నిలదీశారు. సభలు నిర్వహించి రైతులను మభ్యపెడుతున్నారే తప్ప ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న అధికారులకు అర్జీలిచ్చినా పట్టించుకోలేదని, మళ్లీ మళ్లీ ఇవ్వాలంటే ఎలా అని వాపోయారు. తహసీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకే సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అర్జీలిస్తే సాధ్యమైనంతవరకు పరిష్కరించే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.వెంకటస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ షాజియా, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బిట్రగుంట: బోగోలు మండలం చెన్నారాయనిపాళేనికి చెందిన వాలిమేటి శివకుమారి (26) అనే వివాహిత ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. శివకుమారి, నవీన్‌లు భార్యాభర్తలు. వీరికి ఆరేళ్ల వయసున్న కుమార్తె ఉంది. భర్త నవీన్ దగదర్తి మండలం దామవరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతను శుక్రవారం డ్యూటీకి వెళ్లి తిరిగి వచ్చేలోపు శివకుమారి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నవీన్ దామవరం నుంచి బయలుదేరే ముందు భార్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు. ఆలోపే బలవన్మరణానికి పాల్పడింది. కారణాలు తెలియరాలేదు. భార్యాభర్తల మధ్య విభేదాలు లేవని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



భరత్ (ఫైల్)

అల్లూరు: రోడ్డు ప్రమాదంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి మృతిచెందిన ఘటన మండలంలోని నార్త్ ఆములూరు రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నార్త్ ఆములూరుకు చెందిన భరత్ (16) గురువారం రాత్రి పని నిమిత్తం తన ఊరు నుంచి మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. మెయిన్‌రోడ్డుపై ట్రాక్టర్ ట్రక్‌ను ఒకవైపున నిలిపి ఉన్నారు. దీంతో రెండో వైపున భరత్ వెళ్తుండగా ఎదురుగా ఆటో వచ్చింది. దాని లైటింగ్ కారణంగా ప్రమాదవశాత్తు ట్రక్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భరత్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ ఘటనపై అల్లూరు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

మోటార్‌బైక్‌ల దొంగ అరెస్ట్

కందుకూరు: కందుకూరు ప్రాంతంలో మోటార్‌బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్సై సాంబశివయ్య శుక్రవారం తెలిపారు. ఇటీవల అంకమ్మగుడి సమీపంలో ఉంచిన బైక్ పోయినట్లు యజమాని పాశం నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టగా ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన గుంటక మాల్యాద్రి అనే వ్యక్తి బైక్‌ను దొంగతనం చేసినట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో కందుకూరు, పొన్నలూరు, హైదరాబాద్, భీమవరం తదితర ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసినట్లు తేలింది. బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని యజమానులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు